


ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

కృష్ణమ్మ.. పరవళ్లు

- నిండిన శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు
- శ్రీశైలానికి 96,369 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరదనీరు



జూరాల నుంచి నీటి విడుదల

నరసరావుపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణమ్మ ప్రాజెక్టులను దాటి దిగువకు వడివడిగా వస్తోంది. శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండిపోవడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలం దిశగా పరవళ్లు తొక్కుతోంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ఎగువన ఉన్న ఆల్‌మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు నిండాయి. దీంతో వాటి గేట్లు ఎత్తి భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలోకి ఆదివారం 96,369క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో గా వచ్చిచేరుతోంది. ఇది క్రమంగా లక్ష క్యూసెక్కు లు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న పది రోజుల్లో వంద టీఎంసీలకు పైగా నీరు శ్రీశైలానికి వస్తుందని అంచనా. కృష్ణమ్మకు వరదనీరు పోటెత్తుండటంతో సాగర్ ఆయకట్టులో రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్రలో 105.78 టీఎంసీలకు 74.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రెండు రోజుల్లో దాదాపు 25 టీఎంసీల నీరు చేరింది. వరద ప్రవాహం ఇలానే కొనసాగితే ఒకటి రెండు రోజుల్లో తుంగభద్ర గేట్లు కూడా తెరిచి దిగువకు నీటి విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌కు 2,340 కూసెక్కుల నీరు వస్తుంది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 9,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తిస్థాయి నీటినిల్వ	ప్రస్తుత నీటినిల్వ	వస్తున్న వరదనీరు	విడులచేస్తున్న నీరు
	టీఎంసీలలో		క్యూసెక్కుల్లో	
ఆలమట్టి	123.08	96.30	87,217	1,00,064
నారాయణపూర్	33.31	28.90	96,063	1,08,773
జూరాల	9.66	7.04	76,166	84,444
తుంగభద్ర	105.78	74.58	1,12,101	2,464
శ్రీశైలం	215.81	39.15	96,369	నిల్
నాగార్జునసాగర్	312.05	122.52	2,340	9,882
పులిచింతల	45.77	0.82	640	50

బ్యారేజీ నుంచి 12,300 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్: ప్రకాశం బ్యారేజి దిగువకు వరదనీటి విడుదల కొనసాగుతోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి బ్యారేజికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర, తదితర వాగుల నుంచి 13వేల 600 క్యూసెక్కుల వరదనీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 17 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 12 వేల 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.



కౌలు బకాయి.. రూ. 380 కోట్లు

- వైసీపీ నిర్లక్ష్యం.. కూటమి కసరత్తు
- రెండేళ్లుగా అమరావతి రైతుల అవస్థలు
- వాయిదాలతో సరిపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- ఈ ఏడాదితో ముగియనున్న పదేళ్ల గడువు
- పునరుద్ధరణ చేయాలంటూ రైతుల వినతులు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బువ్వ పెట్టే భూములను రాజధాని అమరావతి కోసం ఇచ్చి ప్రభుత్వం ఇచ్చే కౌలుపై ఆధార పడి రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి వారికి కౌలు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అష్టకష్టాలు పెడుతూ వచ్చింది. ఇప్పటికి వైసీపీ ప్రభుత్వం అమరావతి కౌలు బకాయి రూ.380 కోట్లని తేలింది. రైతులకు గత టీడీపీ ప్రభుత్వంలో ఠంచన్‌గా కౌలు చెల్లింపులు జరిగేవి. దీంతో వారు పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులకు వినియోగించుకునే వారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతి రైతులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాజధానికి భూములు ఇవ్వడమే నేరమన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం రైతులను వేధించిందంటే ఆశ్చర్యం కాదు. ఏటా ఇవ్వాల్సిన కౌలు రైతులకు ఇవ్వకుండా వేధిస్తూ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా హైకోర్టు తలుపు తట్టకుండా రైతులకు కౌలు జమ కాలేదంటే వారిపై గత ప్రభుత్వ వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చివరి రెండేళ్లూ కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేతకు పూనుకుంది.

కౌలు రాక అగచాట్లు

రాజధాని కోసం 28,656 మంది రైతులు దాదాపు 34 వేల ఎకరాల భూములు ఇచ్చారు. చిన్న, సన్నకారు రైతుల్లో చాలామంది ఆర్థిక ఇబ్బందులతో రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోగా వారంతా కౌలుకు అనర్హులయ్యారు. తాజా గణాంకాల ప్రకారం 28,656 మందిలో కేవలం 22,980 మందికి మాత్రమే కౌలు వస్తుంది. వీరిలో 90 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు, ప్రధానంగా దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, అసైన్డు రైతులే. ఏటా ప్రభుత్వం కౌలు ఆలస్యంగా చెల్లించడంతో ఆయా వర్గాల రైతులు జీవనానికి అప్పులు చేయాల్సి వచ్చింది. గడిచిన రెండేళ్లలో పూర్తిగా కౌలు ఎగవేయడం తో వారు మరింత అప్పుల ఊబిలో కూరుకుపో యారు. కనీసం ఇల్లు గడవడం, పిల్లలకు ఫీజు లు కట్టుకోవడం కూడా వారికి భారంగా తయారైంది. కిందటేడాది అప్పులు చేసి ఫీజు లు కట్టినా, ఈ ఏడాది ఆ అవకాశం కూడా లేకపోవడంతో పిల్లల చదువులు ప్రశ్నార్థకం గా మారాయని సాధారణ రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరుకుంటున్నారు.

కౌలు చెల్లింపులపై కసరత్తు

రాజధాని రైతులకు చెల్లించాల్సిన కౌలు విషయమై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతుల నుంచి కౌలు చెల్లింపులపై వినతులు పెరుగుతున్న నేపథ్యంలో పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టారు. రైతులకు ప్రభుత్వం రూ.380 కోట్ల మేర కౌలు బకాయిలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కౌలు బకాయిల అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నెలాఖరులోగా కౌలు చెల్లించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు రాజధాని రైతు జేఏసీ నేతలు చెబుతున్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి



సకాలంలో కౌలు రాకపోవడంతో అప్పులపాలయ్యాం. గడిచిన రెండేళ్లుగా కౌలు ఊసే లేకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పుడు అప్పుపుట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రైతులకు కౌలు చెల్లించి ఆదుకోవాలి.

- కాటా అప్పారావు, తుళ్లూరు రైతు

పరిస్థితి దారుణం



మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. పూట గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే కౌలుతో పిల్లల్ని చదివించుకుంటున్నాం. ఇప్పుడు వారికి ఫీజులు కట్టే పరిస్థితి లేదు. కనీసం తినడానికి కూడా అప్పులుచేయాల్సి వస్తోంది.

- మేరిగ నాగేశ్వరరావు, అసైన్డ్ రైతు



శోకసంద్రంలో హారిక తల్లి, బంధువులు



జెట్టి హారిక (ఫైల్)

- తెనాలికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి
- రోడ్డు ప్రమాదంలో ఒకరు.. ప్రమాదవశాత్తు మరొకరు..
- తమ పిల్లల దేహాలను ఇప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు
- స్పందించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్

అమెరికా వెళ్లి.. అనంతలోకాలకు

తెనాలి(ఆంధ్రజ్యోతి), తెనాలి రూరల్, జూలై 21: అమెరికాలో ఉన్నత చదువులతో భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనుకున్న వారి కలలు కల్లలుగా మిగిలాయి. ఉన్నత చదువులతో ఎంతోఎత్తుకు తమ పిల్లలు ఎదుగుతారని ఆశించిన ఆ తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. స్తోమత లేకపోయినా పిల్లలు అమెరికాలో చదువుకుని ప్రయోజకులై తిరిగి వస్తారనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలపై పిడుగులు పడ్డాయి. రెక్కలు ముక్కలు చేసి కూడబెట్టి, మరికొంత అప్పులు చేసి పిల్లల్ని అమెరికాకు పంపగా సంవత్సరం గడిచిందోలేదో వారు అనంతలోకాలకు చేరారని తెలిసి ఆ కుటుంబాలు తీవ్రవిషాదంలో మునిగిపోయాయి. రోజుల వ్యవధిలో అమెరికాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో తెనాలి ఐతానగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఓ స్విమ్మింగ్‌పూల్‌లో పడి తాడిబోయిన రవితేజ(28) రెండురోజుల క్రితం మరణించగా శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో జెట్టి హారిక(25) మృతిచెందింది. రోజులవ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో తెనాలివాసులు విషాదంలో మునిగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఐతానగర్‌కు చెందిన జెట్టి శ్రీనివాసరావు దేవదాయశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఆయనకు హారికతోపాటు మరో కుమారుడున్నారు. ఇద్దరిలో పెద్దదైన హారిక ఉన్నత చదువుకు అమెరికా పంపారు. సామాన్య కుటుంబమే అయినా కుమార్తె కోరిక తీర్చేందుకు తండ్రి అప్పు చేసి పంపించారు. హారిక యూనివర్సిటీ నుంచి శనివారం కారులో ఇంటికి వెళ్తుండగా లోగాన్ కౌంటీలోని ఒక్లహోమా హైవే పెట్రోల్ -74 దగ్గర వరసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హారిక అక్కడికక్కడే మరణించింది. ఈ ప్రమాదం శనివారం జరిగితే, ఆదివారం ఉదయం యూనివర్సిటీ నుంచి తమకు సమాచారం అందిందని ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, నాగమణిలు కన్నీటి పర్యంతమవుతూ చెప్పారు. మృతదేహం గురించి ప్రాధేయపడితే మంచు కారణంగా ఘటనా స్థలికి వెళ్లడం సాధ్యం కావడంలేదని అక్కడున్నవారు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్తె మృతదేహాన్ని తెనాలి తీసుకొచ్చేందుకు కేంద్ర సహాయమంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, మనోహర్‌లు సహకరించాలని వారు వేడుకున్నారు.

స్విమింగ్‌పూల్‌లో జారిపడి రవితేజ..

తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన శ్రీనివాసరావు, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కౌలు రైతుగా ఉన్న శ్రీనివాసరావు ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించటంతో కుటుంబ భారాన్ని తనపై వేసుకున్న తల్లి వ్యవసాయ కూలిపనులు చేసుకుని ఇద్దరు బిడ్డల్ని చదివించింది. స్థోమత లేకపోయినా పెద్దకుమారుడు రవితేజ అమెరికాలో ఎంఎస్ చదువుకుంటానంటే అప్పులుచేసి పంపారు. గత సంవత్సరం అమెరికా వెళ్లిన రవితేజ టెక్సాస్‌లోని ఆస్టిన్ నగరంలో చదువుతూ అక్కడే ఉంటున్నాడు. మూడురోజుల క్రితం మరో మిత్రుడితో కలసి దగ్గర్లోని స్విమింగ్‌పూల్‌కు వెళ్లాడు. పూల్‌లో ప్రమాదవశాత్తు జారి పడిపోయి రవితేజ మృతిచెందాడు. ఈ విషయాన్ని రెండురోజుల తర్వాత అక్కడివారు తెనాలిలోని తల్లికి సమాచారం అందించారు. అప్పటినుంచి రవితేజ తల్లి జయలక్ష్మి కన్నీరుమున్నీరవుతున్నారు. భర్త చనిపోయినా కుమారుడి చదువు ఆగకుండా తాను వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ అమెరికా పంపానని, ఉన్నత చదువులు చదివి తిరిగి వస్తాడనుకుంటే తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ ఆమె విలపిస్తోంది. మృతదేహాన్ని తెనాలికి తీసుకొచ్చే స్తోమత తమకు లేదని, ప్రభుత్వం సహకారం అందించాలని ఆమె వేడుకున్నారు.

ఆందోళన వద్దు.. ప్రయత్నాలు చేస్తున్నాం

అమెరికాలో మరణించిన విద్యార్థుల మృతదేహాలను తెనాలి తీసుకొచ్చే విషయంలో వారి తల్లిదండ్రుల అభ్యర్థనలపై స్పందించి పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే అమెరికాలోని అధికారులతో మాట్లాడారు. ఇండియన్ కమ్యూనిటీ ప్రతినిధులు, అక్కడే ఉంటున్న తెనాలివాసుల నుంచి పరిస్థితి తెలుసుకున్నారు. స్వదేశానికి మృతదేహాలను తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్‌లు హారిక తల్లిదండ్రులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రవితేజ మృతదేహాన్ని కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఏ ఇబ్బంది లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.



విషాదంలో రవితేజ తల్లి జయలక్ష్మి



రవితేజ(ఫైల్)

పైసల్లేవు.. పనులెలా?

- పల్లెల్లో కుంటుపడిన పారిశుధ్యం
- వర్షాలతో అధ్వానంగా మారిన దుస్థితి
- కనీసం బ్లీచింగ్ చల్లలేనిస్థితిలో పంచాయతీలు
- 1172 పంచాయతీలకు రావాల్సిన నిధులు రూ.42 కోట్లు

మురుగు.. చెత్త చెదారాలు.. దోమలు.. అపరిశుభ్రత.. తాగునీరు కలుషితం.. డయేరియా.. జ్వరాలతో పడకేసిన పల్లెలు.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లెల పరిస్థితి. దీనికితోడు రెండు మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో పంచాయతీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. బురద.. మురుగు.. అధ్వాన పారిశుధ్యంతో పల్లెజనం అల్లాడిపోతున్నారు. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే కనీసం బ్లీచింగ్ చల్లలేని దుస్థితిలో పంచాయతీలు ఉన్నాయి. అపరిశుభ్రత తాండవిస్తున్నా.. కనీస చర్యలు తీసుకునేందుకు అవసరమైన నిధులు లేక పంచాయతీ పాలకవర్గాలు నిస్తేజంగా ఉన్నాయి. ప్రజలు అపరిశుభ్ర వాతావరణంలో అవస్థలు పడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి పంచాయతీలది. ఆర్థిక సంఘం నిధులు కోసం పంచాయతీలు ఎదురు చూస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వర్షాలతో గ్రామాల్లో పరిశుభ్రత కుంటుపడింది. రోడ్లపైనే నీరునిలిచి బురదగా మారగా దీనికి చెత్తాచెదారాలు, మురుగు తోడవడంతో పల్లెల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. దోమల వ్యాప్తి ఉధృతమవుతోంది. నిధుల లేమితో పారిశుధ్య పనులు అటకెక్కాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు వ్యాధుల బారినపడే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడనున్నాయి. వైసీపీ పాలనలో ఐదేళ్లు నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులను మార్చిలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని నిధుల వినియోగానికి కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిన విషయం తెలిసిందే.

నిధుల విడుదలపై కూటమి ప్రభుత్వం ఆశ..

ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీ పాలకవర్గాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 1172 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు రూ.42 కోట్లు విడుదల చేయాలి. నిధుల కోసం పాలక వర్గాలు ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి వినతి పత్రాలను అందజేశాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో సాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని అప్పట్లో కేంద్రం ప్రభుత్వం సూచించింది. ఈ పనులు ప్రస్తుతం గ్రామాల్లో తక్షణావసరం. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను తిరిగి పంచాయతీలకు జమ చేయాలని కూటమి ప్రభుత్వ నేతలకు పంచాయతీ పాలకవర్గాలు కోరాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తాగు నీరు కలుషితం అవుతోంది. డయేరియా ప్రబలే ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. వ్యర్థాల నిర్వహణ లేక పోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగు కాల్వల పూడిక తీతకు నోచుకోవడంలేదు. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు, బురదలతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నిధుల కొరతతో ఆయా పనులు చేపట్టే పరిస్థితులు గ్రామాల్లో కానరావడంలేదు. మున్సిపాల్టీల్లో మురుగు, వరద నీటి కాల్వల్లో పూడికతీత కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది. అదే పనుల కోసం పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదు. కనీసం పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.










గ్రామాల్లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం



దిక్సూచి DIKSUCHI

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీ సెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023



బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని చేవ్రాలు, వేలి ముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

బీఎన్ఎస్ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.

కళతప్పిన కృష్ణపట్నం

- అదానీ స్వార్థం, కాకాణి దందాలకు బలి
- కంటైనర్ కార్గో నిలిపివేతతో తీరని నష్టం
- రోడ్డునపడ్డ వేలాదిమంది ఉద్యోగులు
- ఎగుమతుల్లేక సాగు ఉత్పత్తుల ధర పతనం
- గ్రానైట్ పరిశ్రమపైనా పెనుభారం

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

కృష్ణపట్నం పోర్టు.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపార కేంద్రం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కేంద్రం. మూడేళ్ల క్రితం వరకు దేశంలోనే పెద్ద కంటైనర్ కార్గో కేంద్రంగా గుర్తింపు పొందింది. జగన్ ప్రభుత్వంలో పోర్టు యాజమాన్య బాధ్యతలు నవయుగ నుంచి అదానీకి మారడంతో పరిస్థితి మారిపోయింది. అదానీ స్వార్థం, నాటి మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అక్రమ వసూళ్ల కారణంగా పోర్టు క్రమేణా నిర్వీర్యం అయింది. వ్యాపారం తగ్గిందనే సాకు చూపి అదానీ కంటైనర్ కార్గో నిలిపివేసి, సొంత వ్యాపార ప్రయోజనాల కోసం పోర్టును డర్టీ కార్గోగా మార్చివేసింది. తమిళనాడులో అదానీకే చెందిన ఎన్నూరు పోర్టులో బొగ్గు, ఐరన్ కార్గో పట్ల అక్కడ తీవ్ర వ్యతిరేకత రావడంతో కృష్ణపట్నం పోర్టుకు మార్చింది. కంటైనర్ కార్గో నిలిపివేతతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పతనం చేసింది. రాయలసీమ గ్రానైట్ పరిశ్రమలను దెబ్బతీసింది. వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులను వీధిన పడేసింది. పోర్టు ఆధారంగా ఏర్పడిన పరిశ్రమలను శాశ్వతంగా మూసేలా చేసింది. వైసీపీ అధికారంలోకి రాకముందు 2009 నుంచి 2019 వరకు ఉజ్వలంగా వెలిగిన కృష్ణపట్నం పోర్టు గత మూడేళ్ల కాలంలో నిర్వీర్యమైంది. పోర్టును నమ్ముకున్న రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు.



నవయుగ నుంచి అదానీకి

కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ రైతుల త్యాగఫలంతో ఏర్పాటైంది. 1996లో పోర్టు స్థాపించారు. 2007 నుంచి కంటైనర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయి. 2020 మార్చి వరకు ఈ పోర్టు నవయుగ సంస్థ ఆధీనంలో నడిచింది. 2007 నుంచి 2020 వరకు పోర్టులో కంటైనర్ ఆపరేషన్లు అద్భుతంగా నడిచాయి. మొత్తం 14 బెర్తుల్లో 4 బెర్తులు కంటైనర్ కార్గోకు కేటాయించారు. వీటి ద్వారా రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ తదితరాలు ఎగుమతయ్యేవి. పరిశ్రమలకు సంబంధించిన మిషనరీ తదితరాలు విదేశాల నుంచి దిగుమతయ్యేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోర్టుకు గ్రహణం పట్టింది. నవయుగ సంస్థకు ఇబ్బందులు మొదలయ్యాయి. 2020లో పోర్టును అదానీ చేతుల్లో పెట్టకతప్పని పరిస్థితులను నవయుగ సంస్థకు కల్పించారు. ఈ కుట్రలో అప్పటి సీఎం జగన్ హస్తం ఉందనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. 2019కి ముందు రాజకీయాలకు అతీతంగా పోర్టులో వ్యాపార కార్యకలాపాలు సాగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పోర్టుపై ఆ పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. కరోనా ప్రభావం తగ్గిన వెంటనే అప్పటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృష్ణపట్నం పోర్టు వ్యవహారాల్లోకి కాలుపెట్టారు. ఒకవైపు కాకాణి వర్గం అక్రమ వసూళ్ల దందా సాగిస్తుండగా, అదే సమయంలో అదానీ ముందస్తు వ్యూహంతో బెర్త్ ఇన్‌చార్జిలు, హ్యాండిలింగ్ చార్జీలు భారీగా పెంచేశారు. భరించలేక పలువురు పెద్ద లైనర్లు కృష్ణపట్నం పోర్టుకు రావడం మానేశారు. కృష్ణపట్నం కంటైనర్ బిజినెస్‌లో మస్క్ వాటానే 50 శాతం. ఆయన రెండేళ్ల క్రితమే కృష్ణపట్నం పోర్టు వదిలి పెట్టేశారు. దీంతో కంటైనర్ బిజినెస్ ఒక్కసారిగా సగానికి పడిపోయింది. అదానీకి చెందిన ఎన్నూరు (తమిళనాడు) పోర్టులో ఆ కంపెనీ ఉత్పత్తులైన బొగ్గు, ఐరన్ ఓర్ కార్గో పట్ల స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బొగ్గు, ఐరన్ ఓర్ తదితర డర్టీ కార్గోను కృష్ణపట్నం మార్చారు. ఇక్కడ వ్యాపారం తగ్గిందనే సాకు చూపి ఎన్నూరు పోర్టును కంటైనర్ కార్గోగా మార్చుకొని, కృష్ణపట్నం పోర్టును డర్టీ కార్గోగా మార్చేశారు. 2024 జనవరి 31 నుంచి పోర్టులో కంటైనర్ కార్గో పూర్తిగా ఆపేశారు. దీంతో ఎగుమతుల్లేక వ్యవసాయ ఉత్పత్తులు, గ్రానైట్ ధరల పతనం మొదలైంది. ప్రధానంగా నెల్లూరు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి సగటున నెలకు 1000 కంటైనర్ల బియ్యం విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఒక్కో కంటైనర్‌లో 25 టన్నుల బియ్యం బస్తాలు చొప్పున నెలకు 25 వేల టన్నుల బియ్యం ఎగుమతి అయ్యేది. పూర్తిగా ఆగిపోవడంతో ఇప్పుడు చెన్నై, ఎన్నూరు పోర్టులపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు రవాణా చార్జీలు, హ్యాండిలింగ్ చార్జీలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం వరి ధాన్యం ధరలపై పడుతోంది. కంటైనర్ కార్గో ఆగిపోవడంతో పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2-3 వేల కోట్లు నష్టపోతుందన్నది అంచనా.

కాకాణి అవినీతితో ముసలం

కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ కార్గో మూతపడటానికి ప్రధాన కారణం కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతే అనే వాదన బలంగా వినిపిస్తోంది. 2021కి ముందు పోర్టులో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ప్రధాన పార్టీల నాయకులు పంచుకునేవారు. అధికార పార్టీ నాయకులు 60 శాతం, ప్రతిపక్షనేతలు 40 శాతం పనులు చేసుకునేవారు. కంటైనర్ కార్గో కాంట్రాక్టులను మాత్రం సర్టిఫైడ్ కంపెనీలకే కేటాయించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంటైనర్ కార్గో కార్యకలాపాల ద్వారా కూడా డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో స్థానిక వైసీపీ నాయకులు లారీ అసోసియేషన్ అనే దానిని ఏర్పాటు చేసుకున్నారు. పోర్టులోకి కంటైనర్లను రవాణా చేసే యజమానులను భయపెట్టి అసోసియేషన్‌లో చేర్చుకున్నారు. పోర్టు బయట ఒక టోల్‌గేట్ పెట్టి లారీలను ఆపేయించారు. ప్రైవేటు సైన్యాన్ని రంగంలోకి దింపి లారీ టైర్లలో గాలి తీయించారు. పోలీసులు, ఆర్టీఏ అధికారుల ద్వారా తప్పుడు కేసులు పెట్టించారు. ఈ టోల్‌గేట్‌కి కాకాణి టోల్‌గేట్ అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. దీంతో విధిలేక ట్రాన్స్‌పోర్టర్లు అందరూ ఈ అసోసియేషన్‌లో చేరారు. తర్వాత దందాలు మొదలయ్యాయి. ప్రతి వాహనం కాకాణి టోల్‌గేట్ వద్ద రూ.2వేలు చెల్లించాలి. అంతేగాక కంపెనీ లేదా డీలర్ ట్రాన్స్‌పోర్టర్‌కు చెల్లించే అద్దెలో 20 శాతం కమీషన్ ఇవ్వాలి. ఇలా లారీ అసోసియేషన్ పేరుతో ప్రతి లోడుపై రూ.5-7 వేలు దండుకున్నారు. కమీషన్ల బెడదతో ట్రాన్స్‌పోర్టర్లు, డీలర్లు ఈ పోర్టుకు రాకుండా చెన్నై పోర్టుకు వెళ్లడం ప్రారంభించారు. అయినా వైసీపీ గ్యాంగ్ అరాచకాలు ఆపలేదు. అనధికారిక టోల్‌గేట్ ఏర్పాటు చేసి వెంకటాచలం హైవే మీదుగా వెళ్లే వారి నుంచి వసూళ్లు చేసింది. దీన్ని కాకాణి టోల్‌గేట్ నంబర్-2గా పిలిచేవారు.

ఎన్నో అనర్థాలు...

కంటైనర్ కార్గో ద్వారా గతంలో 10 వేలమంది ఉద్యోగులు పోర్టులో పనిచేసేవారు. పోర్టులో 600 కంపెనీల కార్యకలాపాలు ఉండేవి. ఇప్పుడు కార్గో మూతపడటంతో వీరందరూ ఉపాధి కోల్పోయారు. ఆరు వేల ఎకరాల్లో విస్తరించిన పోర్టులో ప్రస్తుతం నికరంగా పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగులు 300 నుంచి 400 మంది మాత్రమే. బొగ్గు దిగుమతుల కారణంగా కాలుష్యం విస్తరిస్తోంది. ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లో విషకారకాల వల్ల ప్రజలకు చర్మవ్యాధులు వస్తున్నాయి. బొగ్గురేణువుల కాలుష్యం నెల్లూరు నగరం హరినాథపురం వరకు వస్తోంది. భవిష్యతులో పోర్టు కాలుష్యం నెల్లూరు నగరంతో పాటు గూడూరు, సూళ్లూరుపేట, కావలి, కందుకూరు డివిజన్ల ప్రాంతాలను సైతం కమ్మేస్తుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

'ఇంటి' దొంగలపై చర్యలేవీ..?



- మంత్రి ఆదేశించినా కదలని హౌసింగ్ ఉన్నతాధికారులు
- విచారణలో తమ పాపాలు కూడా బయటపడతాయనే భయం!
- గత ప్రభుత్వంలో అడుగడుగునా భారీ అవినీతి, అక్రమాలు
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలు బుట్టదాఖలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరుతో గత జగన్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన పథకం అడుగడుగునా అవినీతిమయమైన సంగతి జగమెరిగిన సత్యం. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ దగ్గరి నుంచి.. మెరక పనుల వరకూ వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారు. మరోవైపు పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్లు కూడా రూ.వేల కోట్లు కొట్టేసి పత్తా లేకుండా పోయారు. 'మేం మాత్రం తక్కువ తిన్నామా..!' అన్నట్టు హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బరితెగించి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి, అక్రమాల గురించి పత్రికలు, టీవీ చానెళ్లు, సోషల్ మీడియాలో వరుస కథనాలు వెలువడినా జగన్ సర్కారు కనీసం పట్టించుకోలేదు. దీంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోయి ప్రజాధనాన్ని లూటీ చేశారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు మొదలుకొని జిల్లాల్లోని అధికారులు, ఉద్యోగులు, సాధారణ సిబ్బంది వరకూ అందరూ అవినీతికి పాల్పడి పేదలకు తీరని అన్యాయం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో అడ్డూఆపు లేకుండా సాగిన ఈ అవినీతి, అక్రమాలపై నిజాలు నిగ్గు తేలుస్తూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు ఇచ్చిన నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. అయితే ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పోయి.. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అన్ని ప్రభుత్వ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దోపిడీని బయటపెడుతోంది. దీంతో గృహనిర్మాణ శాఖలో జరిగిన భారీ అవినీతి, కుంభకోణాలపై కూడా లోతుగా విచారణ చేసి.. 'ఇంటి' దొంగల భరతం పట్టాలనే డిమాండ్లు అధికమయ్యాయి.

మంత్రి ఆదేశించినా కదలని యంత్రాంగం

గత ప్రభుత్వం ఆప్షన్-3 కింద పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో దాదాపు 3.5 లక్షల మంది ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారుల తరఫున ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అడ్వాన్సులు తీసుకున్నారు. ఆ ఇళ్లకు సంబంధించిన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను కూడా వాడేసుకున్నారు. కానీ చాలామంది కాంట్రాక్టర్లు లాభదాయకంగా ఉన్న బేస్‌మెంట్ లెవెల్ వరకు మాత్రమే పూర్తిచేసి.. తర్వాత నుంచి పనులు చేయకుండా బిచాణా ఎత్తేశారు. ఈ అంశాలన్నీ ఇటీవల అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించినప్పుడు రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చాయి. దాంతో మంత్రి సీరియస్‌గా స్పందించారు. కాంట్రాక్టర్లు తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా...? దుర్వినియోగమయ్యాయా..? అనేది పరిశీలన చేసి కచ్చితమైన సమాచారంతో ఈ నెలాఖరుకల్లా నివేదిక ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేయకుండా పోయిన కాంట్రాక్టు సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టి.. దోపిడీ చేసిందంతా రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. హౌసింగ్ ఉన్నతాధికారులు మాత్రం దీన్ని అంత సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. మంత్రి సమీక్ష ముగిసి 15 రోజులు గడిచినా అధికారులు వేగంగా కదలడం లేదు. ఈ అవినీతి భాగోతంలో భాగస్వాములైన అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడమే దీనికి కారణమని హౌసింగ్ వర్గాలే చెబుతున్నాయి. విచారణ చేపడితే తమ పాపాలు కూడా బయటపడతాయనే భయంతోనే తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బిల్డింగ్ మెటీరియల్ కొనుగోళ్లలో ఇష్టారాజ్యం

తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి పేద అక్కచెల్లెమ్మలకు ఆస్తిగా అందజేస్తానని అధికారంలో ఉండగా జగన్ ఊదరగొట్టారు. కానీ, కేంద్రం వాటా కింద ఇచ్చిన 22 లక్షల ఇళ్లనే మంజూరు చేశారు. వాటిలో కూడా.. ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేయగలిగారు. వీటిలో ఎక్కువ ఇళ్లు లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో నిర్మించుకున్నవే. ఇక మిగిలిన 17 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. అయితే సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్-3 కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని జగన్ గొప్పలు చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల మందికి పైగా ఆప్షన్-3ని ఎంచుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణ బాధ్యతలను జిల్లాల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించి.. ఒక్కో ఇంటికి రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. అలాగే ఆ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీలును హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ముందే సరఫరా చేసేశారు. అడ్వాన్సు డబ్బులు, సిమెంటు, స్టీలు ముందుగానే తీసేసుకున్న కాంట్రాక్టర్లు చాలా మంది పునాదులు కూడా పూర్తి చేయకుండానే ముఖం చాటేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి.. దాదాపు 22 లక్షల ఇళ్ల కోసమంటూ 13 రకాల నిర్మాణ సామాగ్రిని రాష్ట్ర స్థాయిలోనే కొనుగోలు చేసి.. లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లాలవారీగా హౌసింగ్ గొడౌన్లకు బలవంతంగా తరలించారు. ఇలా ఒక్కో ఇంటికి రూ.1,12,117 విలువైన సామగ్రిని ముందుగానే కొనుగోలు చేసేశారు. అంటే 22 లక్షల ఇళ్ల కోసమని ఏకంగా దాదాపు రూ.25 వేల కోట్లకు పైగా విలువైన నిర్మాణ సామగ్రిని ముందుగానే కొనుగోలు చేయడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉంది. ఈ సామగ్రిని కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవడానికి ముందే ఆయా కంపెనీలతో కమీషన్లు, పర్సంటేజీలు మాట్లాడుకుని రూ.వందల కోట్లు మింగేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

గోడౌన్లలో తుప్పు పట్టిపోతున్న సామగ్రి

నాసిరకం నిర్మాణ సామగ్రిని ఎక్కువ ధరలకు అంటగడుతుండటంతో లబ్ధిదారులతో పాటు కాంట్రాక్టర్లు కూడా వాటిని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లలో నిల్వ చేసిన మెటీరియల్ తుప్పు పట్టి పాడైపోతోంది. దాదాపు మూడేంతులకు పైగా సామగ్రి జిల్లాల్లోని గోడౌన్లలోనే అలాగే ఉండిపోయింది. వెంటనే ఆ సామగ్రిని లబ్ధిదారులకు సరఫరా చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చేసినట్టుగా ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేసేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారితే మొదటికే మోసం వస్తుందన్న భయంతో మే నెలాఖరుకల్లా గోడౌన్లలో ఉన్న మొత్తం స్టాక్‌ను లబ్ధిదారులకు సరఫరా చేసేయాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో జిల్లాల్లోని ఏఈలు, డీఈలు, ఈఈలు, జిల్లా హెడ్స్ అందరూ ఒక్కసారిగా అలెర్ట్ అయిపోయి.. పది రోజుల్లోనే ఏకంగా 5,11,629 పరికరాలను లబ్ధిదారులకు ఇచ్చేసినట్లుగా ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు నమోదు చేసేశారు. దాదాపు 90 శాతం వరకు లబ్ధిదారులకు ఇచ్చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేశారు. ఈ మెటీరియల్స్ విలువ రూ.154 కోట్ల పైమాటే. ఈ మెటీరియల్ సరఫరాలో నిజాలు నిగ్గు తేలాలంటే లబ్ధిదారులను కలిసి విచారణ చేస్తే మొత్తం అవినీతి బాగోతం బయటపడుతుంది.

జీడబ్ల్యుటీసీఎస్ స్వర్ణోత్సవాలకు రండి

● ఏపీ స్పీకర్, మంత్రులకు అధ్యక్షుడు కృష్ణ లాం వినతి


రాష్ట్ర హోం శాఖా మంత్రి అనితను ఆహ్వానిస్తున్న కృష్ణ లాం

గుంటూరు,జూలై21: అమెరికాలోని తెలుగువారికి సేవలందిస్తున్న గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు కల్చరల్ సంఘం (జీడబ్ల్యుటీసీఎస్) ఏర్పాటై 50 సంవత్స రాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న గోల్డెన్ జూబ్లి వేడుకలకు రావలసిందిగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖులను జీడబ్ల్యుటీసీఎస్ అధ్యక్షుడు కృష్ణ లాం ఆదివారం స్వయంగా కలసి విజ్ఞప్తి చేశారు. వాషింగ్టన్ డీసీలో వచ్చే సెప్టెంబర్ 27, 28 తేదీల్లో గోల్డెన్ జూబ్లి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణ లాం తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా పలు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, రాజకీయ నాయకులతో ప్రత్యేక కార్యక్ర మాలను ఏర్పాటు చేస్తున్నట్లు కృష్ణ లాం తెలిపారు. ఈ స్వర్ణోత్స వాలకు హాజరై తెలుగువారి ఔన్నత్యాన్ని పెంపొందించడంలో తమతో పాటు రాష్ట్ర ప్రముఖులు రావసిందిగా ఆహ్వానించామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని కృష్ణ లాం వివరించారు. తన ఇండియా పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, సినీ దర్శకుడు కొరటాల శివ తదితరులను కృష్ణ లాం కలుసుకుని స్వర్ణోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. తెలంగాణలోనూ పలువురు ప్రముఖులను కలిసి ఈ వేడుకలకు రావాల్సిం దిగా ఆహ్వానించామని కృష్ణలాం తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న దివి లీలామాధవరావు

పింఛన్ల పంపిణీని రేషన్ డీలర్లకు ఇవ్వాలి

● డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు

గుంటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీని వలంటీర్లకు అప్పగించి పెద్ద మొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను రేషన్ డీలర్లకు అప్పగించాలని, రేషన్‌డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. నామమాత్రపు చార్జీలతో మూడు రోజుల్లో రాష్ట్రమంతటా పంపిణీని పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలో ది గుంటూరు జిల్లా జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వ హణదారుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ మళ్లీ వైసీపీ ప్రభుత్వం వచ్చి ఉంటే రేషన్ డీలర్ల వ్యవస్థ అనేది లేకుండా చేసేదేనన్నారు. తమకు రూ.7,500 గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.150 కమీషన్ ఇచ్చేలా సీఎం చంద్రబాబు అంగీకరించి మేనిఫెస్టోలో పెట్టారన్నారు. త్వరలోనే డీలర్లకు మంచి రోజులు వస్తాయని, ఎండీయూ వ్యవస్థ తప్పక రద్దు అవుతుందన్నారు. అలానే రేషన్ డీలర్ల నగర కమిటీని రద్దు చేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ఉన్న వైపీబీ ప్రసాదరావు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్షుడిగా లీలామాధవరావు, జనరల్ సెక్రెటరీగా పీటీఎల్ వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుమ్మల గాంధీ ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి డీలర్లను జిల్లా కమిటీలోకి తీసుకొన్నారు.

కన్నా రంగయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

● దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి
● 'పది'లో ప్రతిభచూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ
● హాజరైన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


విద్యార్థినికి స్కాలర్‌షిప్ నగదు చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూలై 21 : విద్యార్థుల భవిష్యత్ కోసం కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో కన్నా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతవహించగా ముఖ్య అతిథిగా మంత్రి రామ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. కన్నా లక్ష్మీనారాయణ, తాను రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ స్నేహభావంతో మెలుగుతున్నామన్నారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలలోనే చదివానన్నారు. పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. కార్పొరేట్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలనే మనస్థత్వాన్ని తల్లిదండ్రులు మానుకోవాలన్నారు. ఈ సేవా కార్యక్రమాలను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతిభా వంతులందరికీ కొనసాగించాలని కన్నాను ఆయన కోరారు.

కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2013 నుంచి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఒక పండుగ వాతావరణంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కన్నా రంగయ్య ఛారిటబుల్ ట్రస్ట్ కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తాతా జయ ప్రకాష్ నారాయణ, చౌట శ్రీనివాసరావు, ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కట్టా శంకరరావు తవితి భవన్నారాయణ తదితరులు ట్రస్ట్ కార్యక్రమాలను కొనియాడారు. 75 మంది విద్యార్థులకు మంత్రి రామనారాయణరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నేతలు స్కాలర్‌షిప్‌ల చెక్కులను అందజేశారు. ముందుగా కన్నా రంగయ్య చిత్రపటానికి వక్తలు, అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు మక్కపాటి రామచంద్రరావు, గోగినేని కోటేశ్వరరావు, భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, నూర్ బాషా జానీ బాబు, పూజల వెంకట కోటయ్య, బత్తుల నాగేశ్వరరావు, పెద్దిరాజు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజక వర్గానికి మొదటి సారిగా వచ్చిన మంత్రి రామనారాయణ రెడ్డిని టీడీపీ నేతలు గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.


స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో మంత్రి ఆనం, ఎమ్మెల్యే కన్నా తదితరులు

జగన్.. శవ రాజకీయాలు మానుకో..

● పరామర్శ పేరుతో విద్వేషాలు పెంచుతున్న మాజీ సీఎం
● పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్
● జనసేన పార్టీ క్రియశీల సభ్యత్వ నమోదు ప్రారంభం


సర్పంచ్ పవన్‌కుమార్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, జూలై 21: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్, దళిత యువకుడైన సుబ్రహ్మణ్యంను నిర్దాక్షిణ్యంగా హత్య చేసి, అతడి మృతదేహాన్ని ఇంటిముందే పడవేస్తే.. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు చర్య తీసుకోలేదేని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. శనివారం మండలంలోని నందివెలుగులో జనసేన పార్టీ క్రియశీల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 64 రోజులు కాకముందే వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. వినుకొండలో యువకుడి హత్యకు ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన వ్యక్తిగత విభేదాలు కారణం కాగా, బాధిత కుటుంబానికి పరామర్శ పేరుతో వచ్చి టీడీపీయే ఆ హత్య చేసిందంటూ మాట్లాడటం దుర్మార్గమన్నారు. రాజకీయాలకు సంబంధంలేని హత్యను రాజకీయం చేస్తూ ప్రజల్లో భయానకవాతావరణం నెలకొల్పేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. తన బాబాయిని గొడ్డలిపోటుతో చంపితే ఆ ఘటనను గుండెపోటుగా చిత్రీకరించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ నేతలను కాపాడుకుంటూ వచ్చాడని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో జగన్ ఉండగా దళితులపై హత్యలు, ప్రతిపక్షాలపై దాడులు, అక్రమ కేసులు, మహిళలపై అఘాయిత్యాలు, గంజాయి మత్తుకు యువకులను బానిసలు చేసిన ఘటనలు, వైసీపీ అల్లరిమూకలతో చేయని అరాచకాలు లేవని ఒక్కసారి ఆయన పాలనను గుర్తుచేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

నందివెలుగును అభివృద్ధి పథంలో నడిపిస్తా ..

మండలంలోని నందివెలుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని నందివెలుగులో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, ఆయన మిత్రబృందం మంత్రి మనోహర్ సమక్షంలో వైసీపీని వీడి జనసేనలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కొత్త సభ్యత్వాలను నమోదు చేసి సభ్యత్వం పొందిన వారికి గుర్తింపుకార్డులు అందించారు. మనోహర్ మాట్లాడుతూ గ్రామంలోని హైస్కూల్ భవన నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు వంటి వాటిని త్వరలోనే పూర్తి చేయించి గ్రామాన్ని నెం1గా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్ వైసీపీని వీడి జనసేనలోకి రావడం శుభపరిణామమన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్
● పిట్టలవానిపాలెంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ
● పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన, వివిధ సంఘాల నేతలు

పిట్టలవానిపాలెం, జూలై 21 : ప్రపంచ మహా మేధావిగా, భారత రత్నగా డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ పేరు గడించారని ఆయన మనవడు ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్‌లో మంతెనవారిపాలెంకు చెందిన అంబేద్కర్ యువ కెరటాలు, పిట్టలవానిపాలెం మండల అంబేద్కర్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆనందరాజ్ యశ్వంత్ అంబేద్కర్ ఆవిష్కరించారు. తొలుత బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ అంబేద్కర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆనంద రాజ్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం, శ్రేయస్సు కోసం డాక్టర్ బీఆర్ అబేద్కర్ రాజ్యాంగబద్ధంగా వివిధ హక్కులను కల్పించారన్నారు. ముఖ్యంగా ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో ఆయా ప్రజలకు అనేక ప్రయోజనాలను కల్పించారన్నారు. వాటన్నింటినీ సద్వినియోగం చేసుకొని ఆ సామాజిక వర్గాలు ఉన్నత విలువలతో ముందుకు సాగాలన్నారు. అంబేద్కర్ కొన్నివర్గాల వ్యక్తికాదు ప్రపంచవ్యాప్తంగా అందరికి ఆదర్శ ప్రాయుడని తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ అంబేద్కర్ భావాలను ప్రతి ఒక్కరు అలవర్చుకొని వాటిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. సభకు గుంటూరు అంబేద్కరిస్ట్ డాక్టర్ చుక్కా నాగభూషణం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశిష్ఠ అతిథి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్, గౌరవ అతిథులు ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ జోసఫ్ ఇమ్మానియేలు, కేంద్ర మాజీ మంత్రి పనబాకలక్ష్మీ, పిట్టలవానిపాలెం జడ్పీటీసీ గోవతోటి సురేఖ, పిట్టలవానిపాలెం సర్పంచ్ బొలగాని అరుణకుమారి, విశ్రాంత ఐఆర్‌టీఎస్ పనబాక కృష్ణయ్య, విశ్రాంత ఐఆర్ఎస్ ఉప్పులేటి దేవి ప్రసాద్, మాజీ ఐఆర్ఎస్ ఎస్.రవిబాబు, బహుజన కెరటాల వ్యవస్థాపకులు పల్నాటి శ్రీరాములు, పరబాని నాందేడ్, పాలేటి మహేశ్వరరావు, గద్దర్ తనయుడు జీవి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ అంబేద్కర్ మనవడు ఆనందరాజ్ యశ్వంత్

విశ్రాంత ఉద్యోగి జన్మదిన వేడుకలకు

హాస్టల్ విద్యార్థుల భోజనం..

● అడ్డుకున్న విద్యార్థి సంఘాల నాయకులు
● నాగార్జున విశ్వవిద్యాలయంలో హాస్టల్ విద్యార్థుల ఆందోళన

పెదకాకాని, జూలై 21: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం హాస్టల్ విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని విద్యార్థులకు కాకుండా ఓ విశ్రాంత ఉద్యోగి జన్మదిన వేడుకల కార్యక్రమానికి తరలిస్తుండగా విద్యార్థి సంఘ నేతలు అడ్డుకున్నారు. ఇదేంపని అని ఈ విషయంపై నిర్వాహకులను వారు ప్రశ్నించారు. దీంతో హాస్టల్ నిర్వాహకులకు, విద్యార్థులకు మధ్య పెద్ద ఎత్తున వాగ్వివాదం ఏర్పడింది. విద్యార్థులు పెద్ద ఎత్తున కేకలు వేస్తూ, నిర్వాహకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్లోనే ఆందోళన బాటపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని, మెస్ చార్జీలను భారీగా పెంచి అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరో పించారు. హాస్టల్ విద్యార్థులకు తయారుచేసిన భోజనాన్ని ప్రైవేటు కార్యక్రమానికి ఎందుకు తరలించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అవినీతి మత్తులో కూరుకుపోయిన వర్సిటీ అధికారుల ప్రమేయంతోనే ఇదంతా జరుగుతుందని, వారు ఏనాడు విద్యార్థు లను పట్టిం చుకున్నది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయం కల్పించడంలో నిర్వాహకులు పూర్తిగా విఫల మయ్యారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు.


వర్సిటీ హాస్టల్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

హోరాహోరీగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

● మొదటి బహుమతి సాధించిన నిజాంపట్నం క్రీడాకారులు

భట్టిప్రోలు, జూలై 21 : ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ఛాంపియన్‌షిప్ 2024 ఎంపిక పోటీలు హోరాహోరీగా జరిగాయి. మండలంలోని పల్లెకోనలోని పరుచూరి రఘుబాబు కళా ప్రాంగణంలో జరిగిన తైక్వాండో పోటీలను ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్, ప్రముఖ వైద్యులు వేజళ్ళ పూర్ణానంద్‌లు ప్రారంభించారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో సబ్ జూనియర్, జూనియర్స్, క్యాడెట్, సీనియర్ విభాగాలలో 180 మంది బాలబాలికలు పాల్గొని హోరాహోరీగా పోటీలో పాల్గొన్నారు.

ఏబీసీ తైక్వాండో క్లబ్ రేపల్లె కోచ్ నేషనల్ రిఫరీ ఎ. డేవిడ్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. రాత్రి వరకు జరిగిన పోటీలలో మొదటి బహుమతి సాధించిన నిజాంపట్నం టీమ్‌కు రూ.15 వేలు, ద్వితీయ బహుమతి సాధించిన తెనాలి టీమ్‌కు రూ.10 వేలు, తృతీయ బహుమతి సాధించిన రేపల్లె టీమ్‌కు రూ.5 వేలు నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలను అందజేశారు. రిఫరీలుగా ఏ.దిలీప్, ఏ. చైతన్య, అశ్విల్ అహ్మద్, యూటీఎఫ్ నాయకులు కే.సురేష్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు, స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేజళ్ళ బసవపున్నయ్య, రాయన ప్రసాద్, వేజళ్ళ సతీష్, జీవీ సాంబశివరావు, రావూరి వరప్రసాద్, మండవ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త రవికిరణ్


విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు

● అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు
● సమావేశాలు ముగిసే వరకు విధుల్లో అప్రమత్తం
● అధికారులు సిబ్బందికి ఎస్పీ సతీష్ కుమార్ దిశా నిర్దేశం

గుంటూరు, జూలై 21 : రాజధాని అమరావతిలో నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజధాని ప్రాంతంలో అసెంబ్లీ సమావేశాల బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. బందోబస్తు విధులకు హాజరైన అధికారులు, సిబ్బందికి భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దారి వెంట బాంబు డిస్పోజల్ టీములు, ఏరియా డామినేషన్ పార్టీలు, డాగ్ స్క్వాడ్ బృందాలు, రోప్ పార్టీలు, టోయింగ్ వెహికల్స్ వారికి కేటాయించిన విధులను అయా ప్రదేశాలలో అందుబాటులో వుండాలని సూచించారు. సచివాలయం, అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమైన ప్రాంతాలు, హెలిప్యాడ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కే.శ్రీనివాసరావు, క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్‌గౌడ్, ఎఆర్ డీఎస్పీ శాంతకుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్, ఇతర సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

గుంటూరు(విద్య)జులై 21) జిల్లావ్యాప్తంగా ఈనెల 22 నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని గుంటూరు జిల్లా విద్యాశాకాధికారి పీ. శైలజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం పూర్తి అయిన సందర్భంగా కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రధానో పాధ్యాయులు ఆయా పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 22వ తేది స్థానిక వనరు లతో బోధన అభ్యసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించటం, 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న క్రీడా దినోత్సవం- విద్యార్థులకు క్రీడలు, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేందుకు క్రీడా పోటీలను నిర్వహించాలని సూచించారు 25న సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్దేశించిన విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో పీ. శైలజ, ఎస్ఎస్ఏ ఏపీసీ.విజయ లక్ష్మి సూచించారు.


నిందితుల వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐలు, ఎస్ఐ

గంజాయి విక్రేతలు అరెస్టు

● మొత్తం నిందితుల్లో ఒకరు మైనర్, ఆరుగురు యువకులు
● పోలీసుల అదుపులో ముగ్గురు.. పరారీలో నలుగురు
● రెండు కిలోల గంజాయి స్వాధీనం.. డీఎస్పీ రమేష్‌బాబు వెల్లడి

తెనాలి రూరల్, జూలై 21: విశాఖ నుండి గంజాయి తెచ్చి తెనాలి ప్రాంతంలో ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్న ముఠాను అరెస్ట్‌చేసినట్లు డీఎస్పీ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను మీడియా ముందు హాజరుపరిచి వివరాల వెల్లడించారు. బాపట్లకు చెందిన అల్లుమోల్లు మణికుమార్‌రెడ్డి, విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన తాడిశెట్టి జోసెఫ్, కఠెవరం గ్రామానికి చెందిన ఓ మైనర్‌బాలుడు, కఠెవరంకు చెందిన షేక్ ఇమ్రాన్, యర్రబాలెంకు చెందిన భార్గవ్ ప్రశాంత్, మంగళగిరికి చెందిన తిరువీదుల సాయి కృష్ణ, మంగళగిరికి చెందిన కగ్గా తిరుపతయ్యలు ముఠాగా ఏర్పడ్డారు. కఠెవరం గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ విశాఖ నుండి గంజాయిని తెచ్చి కఠెవరంలో అద్దెకు తీసుకున్న ఇంట్లో ఉంచి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా కట్టి తెనాలి, మంగళగిరి పరసర ప్రాంతాల్లో మిగిలిన ఆరుగురు నిందితులతో అమ్మకాలు చేయిస్తూ ఉంటాడు. వీరు కళాశాల విద్యార్థులు, యువకులే లక్ష్యంగా ఎంచుకొని విక్రయాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తుంటారు. ఈ ముఠా కదలికలపై నిఘా పెట్టామన్నారు. శనివారం కఠెవరం గ్రామంలో జెండాచెట్టు వద్ద ఇమ్రాన్ అద్దెకు ఉంటున్న గదిని సోదాచేయగా అల్లుమోల్లు మణికుమార్‌రెడ్డి, తాడిశెట్టి జోసెఫ్, కఠెవరం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడు ముగ్గురు నిందితులు గంజాయి తూఁతూ రెండు కేజీల గంజాయిని ప్యాక్ చేస్తూ ఉన్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగిలిన నలుగురు నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎంతో చాకచక్యంగా నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తిపై కత్తితో దాడి

తెనాలి క్రైం, జులై 21 : తెనాలి రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి 11.45 గంటల సమయంలో 3వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన జరిగింది. స్థానిక పాండురంగ పేటకు చెందిన పత్తులోతు రాజు రైలులో వైజాగ్ నుంచి తన కుమారిడి కోసం 3వ నెంబరు ప్లాట్‌పారంపై వేచి ఉండగా, అదే సమయంలో ఓ యువకుడు అతని వద్దకు వచ్చి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నించాడు. అడ్డుకున్న రాజుపై అగంతకుడు పిడిబాకుతో భుజంపై మూడు సార్లు పొడిచి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితుడు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడానికి ప్లాట్‌ఫారంపై చూడగా ఒక్క పోలీసు కనిపించలేదని, చివరికి స్టేషన్ మాస్టర్ గదిలోని ఉద్యోగికి సమాచారం ఇచ్చినట్లు రాజు తెలిపాడు. రాత్రి అయితే తెనాలి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలు మత్తు గ్యాంగులకు, బిచ్చగాళ్ళకు అవాసంగా మారుతున్నాయని, దీంతో రాత్రి వేళ ప్రయాణించే ప్రయాణికులు భయం భయంతో తాము ఎక్కే రైలు కోసం వేచి ఉండవలసి వస్తుందని ఇప్పటికైనా స్టేషన్‌లో పోలీసు పహారా పెంచి మత్తు గ్యాంగుల ఆగడాలను అరికట్టాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127,138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00



పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి | పెదకూరపాడు



పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌లో ఎస్పీ, వెల్దుర్తిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ

ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● పిడుగురాళ్ల పోలీసులకు ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశం

పిడుగురాళ్ల, జూలై 21: పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కే.శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించారు. ఆదివారం పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి ఫిర్యాదుల విభాగాన్ని, లాకప్, టెక్నికల్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణ సిఐ ఎస్ వెంకటరావుతో మాట్లాడుతూ గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాలను గుర్తించి, అక్కడ మఫ్టీలో కొందరు పోలీసులతో అనుమానితుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఫిర్యాదులు స్వీకరించడం, సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు. అలాగే స్పెషల్ బ్రాంచి పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు.

వెల్దుర్తి : పల్లెల్లో ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుండ్లపాడు, కేపీగూడెంలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్థులతో మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు అనవసరంగా గొడవలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట మాచర్ల రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరణ

పిడుగురాళ్ల, జూలై 21: పల్నాడుజిల్లా గురజాల నియోజకవర్గం నడికుడి, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లలో విశాఖ, నారాయణాద్రి, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 19 నుంచి స్టాపింగ్ ఎత్తివేస్తున్నట్లు రైల్వే అధికారులు గత రెండు రోజుల క్రితమే ప్రకటించారు. దీనిపై గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పల్నాడు ప్రాంతంలోని నడికూడి, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లలో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వడం వల్ల కలిగే ఉపయోగాలు వేలాది మంది ప్రయాణీకులకు కలిగే వెసులుబాటును వివరించి ఆ మూడు రైళ్లకు స్టాపింగ్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు ఆదివారం నుంచి తిరిగి స్టాపింగ్ సౌకర్యాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆదివారం నుంచి విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు యథావిధిగా నడికూడి, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ కల్పించడంతో పాటు రిజర్వేషన్ చార్ట్‌లోనూ, ఆన్‌లైన్‌లో రైళ్ల సమయ పట్టికను ఇచ్చారు. ఇందుకుగాను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పలువురు వ్యాపారులు, ప్రయాణీకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రత్న కుమార్ అకాల మృతి పార్టీకి తీరని లోటు

పెదకూరపాడు, జూలై 21 : టీడీపీ మండల నేత నీలం రత్నకుమార్ అకాల మృతి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు అన్నారు. మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన టీడీపీ మండల నేత నీలం రత్నకుమార్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం కాశిపాడులోని రత్న కుమార్ గృహానికి వెళ్ళి కుటుంబ సభ్యులను వరప్రసాదు పరామర్శించారు. వారి వెంట 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు వట్టికూటి శివరామకృష్ణయ్య, టీడీపీ మండల నాయకులు పలువురు ఉన్నారు. పెదకూరపాడులో టీడీపీ నేత షేక్ మస్తాన్‌వ(మల్లు) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కూడా వర ప్రసాదు పెదకూరపాడు వెళ్ళి పరామర్శించారు.

ప్రతిభ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

రాజుపాలెం, జూలై 21 : మండలంలోని కొండమోడు శివారు వీరమ్మ కాలనీలోని అనాథ పిల్లల, వృద్ధాశ్రమంలోని వారికి కొత్తూరు గ్రామానికి చెందిన ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్, సభ్యులు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసమే తమ సంస్థ స్థాపన జరిగిందన్నారు. ఆశ్రమం ఏర్పాటు చేసి సేవచేస్తున్న శంకర్‌రావును ప్రత్యేకంగా అభినందిం చారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ పాశం శ్రీనివాసరెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించిన సీఐ

రెంటచింతల, జూలై 21 : మండల కేంద్రమైన రెంటచింతలలోని జెండా చెట్టు సెంటర్‌లో ఏరువ ప్రతాప్‌రెడ్డి గృహంలో దొంగతనం జరిగిన తీరును కారంపూడి సీఐ అళహరి శ్రీనివాస్, ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఘటనా ప్రాంతంలో వేలిముద్రలను సేకరించారు. ఇటీవల కాలంలో జరిగిన దొంగతనాలన్నీ గృహయజమానులు ఊరెళ్లినప్పుడే జరిగినవి కావడం గమనార్హం. పాత నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఏరువ ప్రతాప్‌రెడ్డి ఇంట్లో సుమారు 92 గ్రాములు బంగారం రూ.లక్ష నగదు చోరీ జరగడం సంచలనాత్మకంగా మారింది.

ట్రాఫిక్‌కు అంతరాయం ఉండకూడదు

పిడుగురాళ్ల, జూలై 21: పట్టణంలో చిరువ్యాపారుల నుంచ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ కూడదని, నిర్దేశిత ప్రాంతాలకే పరిమితమై వారు వారి వ్యాపారాలను నిర్వహించరోవాలని పట్టణ సీఐ వెంకటరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో సీఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లపై వ్యాపారాలు నిర్వహించుకునే చిరు వ్యాపారులు వారికి కేటాయించిన ప్రాంతాలలో వ్యాపారం చేసుకోవాలని, రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్ సమస్యలను సృష్టించ వద్దని వాహనదారులకు ఇబ్బంది కలిగించ వద్దని సూచించారు.



ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

అమ్మకు బోనాలు.. జగతికి భాగ్యాలు

రెంటచింతల,జూలై 21 : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతైన ముత్యాలమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచి ఒక్కపొద్దున్న మహిళలు నియమ నిష్టలతో బోనం వండి పసుపు కుంకుమలతో అలంకరించి పూలు, వేపాకుల దండలను వేసి శివ సత్తువుల పూనకాలతో బోనాలను అమ్మవార్లకు అర్పించారు. చీర సారెలను అమ్మవారి ముందుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. రానున్న కాలమంతా పాడి పంటలతో కళకళలాడాలని కరువు దరి చేరకూడదని వేడుకున్నారు.డప్పు చప్పుళ్లతో సంబరాలు జరుపుకున్నారు. అలాగే రెండు చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో ఆతల్లిని శాకంబరీగా(కూరగాయలు)తీర్చి దిద్దారు. జంక్షన్‌లోని షిర్డి సాయి బాబ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ ఛైర్మన్ పందిరి శ్రీనివాస రావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.

సత్తెనపల్లి : పట్టణంలోని పుతుంబాక వెంకటపతి కాలనీలో ఉన్న నీలం పాటి లక్ష్మీ అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని ఆదివారం కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. బోనాలను ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్యామలాంబ మాతాజీ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

పెదకూరపాడు : పెదకూరపాడులోని వాసవి అమ్మవారి దేవాలయంలో ఆదివారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో పలురకాల పూలు, పండ్లు, పసుపు, కుంకుమలు, నైవేద్యాలు, చీరలు అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచే మహిళలు అధిక సంఖ్యలో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని కనకదుర్గ అమ్మవారిని ఆషాడమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

● కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

● హాజరైన ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, జూలై 21 : ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తన వంతు కృషిచేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి రామనారయణరెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన దాతలకు ముందుగా అభినందనలు తెలిపారు. ఢిల్లీలో పని చేస్తున్న ఓ అధికారి ఆలయ నిర్మాణానికి నిధులు సమకూర్చటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నాలుగు వైపులా ప్రహరీ నిర్మాణానికి దాతల సహకారంతో త్వరలోనే పూర్తి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో 36 ఆలయాలు ముంపునకు గురయ్యాయని మాజీ మంత్రి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు కన్నా, ప్రవీణ్

కన్నా మినిస్టర్ దృష్టికి తీసుకు వెళ్ళారు. త్వరలోనే ఆలయ నిర్మాణాలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మూల విరాట్‌కు వెండి తోరణం ..

కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలోని స్వామి మూల విరాట్‌కు మంత్రి రామ నారాయణరెడ్డి తన కుమారుడి పేరు పై వెండి తోరణాన్ని కానుకగా ఇస్తానని మంత్రి తెలిపారు. కూటమి ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ముందుగా ఆలయంలో మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లు ఆకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి, ఎమ్మెల్యేలు ఆలయం వద్దకు వస్తున్నారని తెలియగానే ఆలయ పూజారులు నరసింహాచార్యులు, అనంతబాబు, మరి కొంత మంది పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకు వెళ్ళారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా నేతలు నాయకులు భాష్యం ఆంజనేయులు, పరుచూరి పూర్ణచంద్రరరావు, సర్పంచ్ జ్యోతి సముద్రం, గంగారావు, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, వెన్నా సీతారామిరెడ్డి, జిల్లా దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో మెడికల్ షాపు దగ్ధం

పిడుగురాళ్ల, జూలై 21: పట్టణంలోని పున్నం హాస్పటల్ ఎదురుగా వున్న సాయి మెడికల్ షాపులో శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. షాపు యజమాని కూరపాటి మణికుమార్ రోజులాగానే 9 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో షాపు దగ్ధమవుతున్నట్లు విషయం తెలుసుకున్న మణికుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షలు వరకు నష్టం వాటిల్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మణికుమార్ తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు

దుర్గి, జూలై 21: మండల కేంద్రమైన దుర్గిలో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, సూరె బాల, సుబ్రహ్మణ్యం, పగడాల కిట్టయ్య, బీమా అమరయ్య, కోరె నాగరాజు పాల్గొన్నారు.



నడికూడి - మాచర్ల జంక్షన్‌లోని పెట్రోలు బంకు వద్ద దుర్గమ్మగుడిలోకి చేరిన వర్షపునీరు

దేవాలయంలోకి వర్షపు నీరు

దాచేపల్లి, జూలై 21: నిత్యం భక్తులతో రద్దీగా వుండే నడికూడి-మాచర్ల జంక్షన్‌లోని పెట్రోలు బంకు సమీపంలో వున్న కనక దుర్గమ్మగుడి లోకి వర్షపునీరు వచ్చిచేరింది. ఆదివారం దేవాలయంలోకి 2 అడుగుల లోతు నీరు చేరడంతో పూజా కార్యక్రమాలకు, భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఆలయం ముందు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఆలయం లోతట్టు ప్రాంతంగా వుండటం, రోడ్డు విస్తరణ పనులతో పోసిన మట్టి మెరకగా వుండటంతో వర్షపునీరు అంతా ఆలయంలోకి చేరింది. ఆషాడమాసం కావడంతో ఆదివారం అమ్మవారికి బోనాలు, మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులు వర్షపునీటిలో పూజా కార్యక్రమాలు చేసేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆలయంలో వర్షపు నీరు నిల్వ లేకుండా చేసి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని స్థానికులు ఆలయ నిర్వాహకులను కోరుతున్నారు.



రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లకు కొలతలు తీస్తున్న వైద్యులు

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు ఏర్పాటు

పిడుగురాళ్ల, జూలై 21: రోటరీక్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్‌సిటీ, ఖమ్మం శాఖల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవికల్యాణ మండపంలో కృత్రిమ కాళ్ల అమరికపై వైద్యశిబిరం నిర్వహించారు. జైపూర్ నుంచి వచ్చిన వైద్యులు, సిబ్బంది సుమారు 100 మంది దివ్యాంగులకు కొలతలు తీసుకోవడం జరిగింది. రోటరీక్లబ్ అధ్యక్షులు గుండా అశోక్, నూతి నారాయణ, పసుమర్తి రంగారావు, డి సాంబశివరావు, బి సుధాకర్, వంకాయల గోపి, కాకుమాను శ్రీను, నీరుమళ్ల రాజేష్, రోటరీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో మాచర్ల అధ్యక్షుడిగా ఖాసీం

మాచర్లటౌన్, జూలై 21: ఏపీఎన్‌జీవో మాచర్ల తాలూకా అధ్యక్షుడిగా ఎస్‌కేఎంపీ ఖాసీం ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా సుశీల ఎన్నికయ్యారు. పట్టణంలోని ఏపీఎన్‌జీవో కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. అనంతరం నూతన సభ్యులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, గుంటూరు సిటి అధ్యక్షుడు ఎస్‌పీ ఎస్ సూరి తదితరులు పాల్గొన్నారు.

400 మందికి వైద్యపరీక్షలు

● ఉచితంగా మందులు పంపిణీ

మాచవరం, జూలై 21: మండలంలోని వేమవరం గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యరపతినేని లక్ష్మయ్య జ్ఞాపకార్థం గ్రామపెద్దల సహకారంతో గుంటూరు పట్టణానికి చెందిన మ్యాట్రిక్స్ హాస్పటల్ వారు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు మానిపాటి శ్రీకాంత్, అనుపమ ముత్యాల, కే సతీష్ చైతన్య, గోవిందు, యుక్తాశ్రీలు పాల్గొని రోగులను పరీక్షించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరం నిర్వహణకు వేమవరం గ్రామ టీడీపీ నాయకులు కొలగాని శివ, గుదె లక్ష్మీనారాయణ, ఏనుపొంగు ఆనందరావు, గోళ్ల గంగాధర్, పూసల సత్యనారాయణ, కామిశెట్టి శ్రీనివాసరావు, కొలగాని శ్రీనివాసరావు, తిప్పాల వెంకటేశ్వర్లు, శివ, కామిశెట్టి సైదయ్య, ఆతుకూరి శ్రీనుబాబు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో గురు పౌర్ణమి పూజలు

సత్తెనపల్లి రూరల్, జూలై 21 : గురు పౌర్ణమిని సందర్భంగా ఆదివారం భకుతులు పలు ఆలయాలలో పత్రేక పూజలు నిర్వహించారు. మండలంలోని నందిగామలోని సాయి బాబా దేవాలయానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. సాయి నాధుని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చెందిన ఆళ్ళ కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

పిడుగురాళ్ల: స్థానిక షిరిడీ సాయిరామ్ మందిర్‌లో గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దర్శనం అనంతరం సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

కారంపూడి: పట్టణంలోని శ్రీదేవి భూదేవిసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. వ్యాసపూర్ణిమ, గురుపూర్ణిమ సందర్భంగా కార్యక్రమం జరిపారు.

మాచవరం: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గుమ్మడి ఎల్లయ్య గురుస్వామి గురుపౌర్ణమి ఉపన్యాసం చేసి దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మాచర్ల రూరల్: మండలంలోని విజయపురిసౌత్‌లోని శ్రీసత్య సాయి ప్రేమ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు హనుమంతాచారి ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానంచేశారు.

సత్తెనపల్లి: పట్టణంలోని మెయిన్‌రోడ్డులోగల షిరిడీ సాయి దేవాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోని సాయిబాబా దేవాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గుంటూరులోని సాయి బాబా దేవాలయంలో పూజల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్..



ఆకులగణపవరం గ్రామంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

రాజుపాలెం: మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో వేంచేసియున్న సాయిబాబా ఆలయంలోని సాయినాధుడిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

అమరావతి: మండల పరిధిలోని భవఘ్ని ఆరామంలోని వ్యాసదేవాలయంలో వ్యాసమహార్షికి భవఘ్ని గురుదంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తో పాటు భవఘ్ని శిష్యులు వేలాదిగా పాల్గొన్నారు.

అమరావతిలోని షిర్డీసాయి మందిరంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మందిరంతో పాటు ముత్తాయపాలెం, ఉంగుటూరు, నరుకుళ్లపాడు, మండెపూడి, కర్లపూడి తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాలను భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు.

క్రోసూరు : స్థానిక షిరిడీ సాయి బాబా మందిరంలో బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు బాబా దేవాలయాన్ని సందర్శించి ఉత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన పల్లకి సేవ కోలాహలంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని రామాపురం, పెదకూరపాడు సాయిబాబా ఆలయాల్లో తెల్లవారు జామునుంచే భక్తులు బారులు తీరి స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

గుంటూరులోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యంప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన గురు పౌర్ణమి వేడుకల్లో రామదూత స్వామి ఆశీస్సులను ప్రవీణ్ అందుకున్నారు.

దుర్గి: గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శ్రీరాం కాశిబాబు ఆధ్వర్యాన భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం పులిహోర, పొంగళి పంపిణీ చేశారు. సాయిబాబా ఆలయం వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

మహిళ మెడలో నాంతాడు చోరీ

● వరుస దొంగతనాలతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు

మాచర్ల రూరల్, జూలై 21: మహిళ మెడలో నాంతాడు చోరీ జరిగిన సంఘటన మాచర్ల పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పాల్వాయి సత్యవతి అదే వార్డులోని సాయిబాబా గుడికి వెళ్తుండగా వెనుకగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని నాంతాడు లాక్కొని పారిపోయారు. కాగా సత్యవతి నాంతాడు గట్టిగా పట్టుకోవడంతో చిన్న ముక్క ఆమె చేతిలో మిగిలిపోయింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇటీవల కాలంలో పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత రెండు నెలల్లో ఇది మూడో దొంగతనం. ఈ ప్రాంతంలోనే రెండుసార్లు దొంగతనాలు జరిగాయి.



సుభానీ కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న కొణిదల నాగబాబు

జనసేన కార్యకర్తల శ్రేయస్సే ప్రధానం

● జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు

నకరికల్లు, జూలై 21 : జనసేన కార్యకర్తల శ్రేయస్సే ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు తెలిపారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో షేక్ సుభానీ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును నాగబాబు అందజేశారు. జనసేన క్రియాశీలక సభ్యత్వం కలిగిన షేక్ సుభానీ గత సంవత్సరం పాము కాటుకు గురై మృతి చెందాడు. ఆయన భార్యకు ఆదివారం రూ.5 లక్షల చెక్కును నాగబాబు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరుజిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసేన నేతలు శిరిగిమణికంఠ, రాడ్ల శ్రీనివాసరావు, రామాంజనేయులు, గాని నాగేశ్వరరావు, బత్తిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: జనసేన ప్రమాద బీమా చెక్కును సత్తెనపల్లి నియోజక వర్గ జనసేన సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు ఆదేశాల మేరకు ధూళ్ళిపాళ్ళకు చెందిన అద్దెపల్లి శివకోటేశ్వరరావుకు ఆదివారం జనసేన నేతలు అందించారు. ధూళ్ళిపాళ్ళకు చెందిన అద్దెపల్లి శివ కోటేశ్వరరావు కొన్ని నెలల క్రితం ప్రమాదానికి గురయ్యాడు. ఆయన జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని కలిగి ఉన్నాడు. దీంతో ఆయనకు ప్రమాద బీమా రూ.14వేలు చెక్కును మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పలువురు జన సైనికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగ పల్లెల అభివృద్ధికి కృషి చేస్తా

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హామీ

క్రోసూరు, జూలై 21 : పెదకూరపాడు నియోజక వర్గంలోని మాదిగ పల్లెల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ హామీ ఇచ్చారు. ఆదివారం క్రోసూరు మండలానికి చెందిన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా నాయకులతో కలసి గుంటూరులో కార్యాలయంలో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్‌ను కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో మాదిగ పల్లెలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, గత ఐదు సంవత్సరాల్లో పల్లెలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళినట్టు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలియ జేశారు. పల్లెల్లో సిమెంట్ రోడ్లు, సైడు డ్రైయిన్స్, తాగు నీటి సౌకర్యం లేదని, కొన్ని పల్లెలకు కనీసం శ్మశాన వాటిక కూడా లేదని ఎమ్మెల్యేకి వివరించారు. మాదిగ పల్లెల్లో మౌళిక వసతుల అభివృద్ధితో పాటు కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం, గ్రంథాలయ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. తమ సమస్యలను సావదానంగా ఆలకించిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరలో మాదిగ పల్లెలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొడవటి అశోక్ మాదిగ, నియోజక వర్గ అధ్యక్షుడు నందిగం దేవదాసు మాదిగ, జడ సుబ్బు మాదిగ, కొడవటి కృపారావు మాదిగ, సిద్దెల దిలీప్‌కుమార్, దుగ్గి కృపారావు, కుమారి పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ కార్మికులకు పనిభద్రత కల్పించాలి

మాచర్లటౌన్, జూలై 21: సివిల్ సప్లయిస్ కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో ఆదివారం ముఠా కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కార్మికులకు పని భద్రత కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. గిట్టుబాటు కాని కూలి రేట్లకు ఏళ్ల తరబడి చాకిరి చేసినా కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. కూలీ రేట్ల పెంపుదల అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసి 7 నెలలు పూర్తయినప్పటికీ కూలీరేట్ల పెంపుపై ఎటువంటి చర్యలు చేపట్టని యాజమాన్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి సుధీర్, ఏఐటీయూసీ మాచర్ల ఏరియా కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, ముఠామేస్త్రి ఆకుల అమరయ్య, కొండ గురులింగం, లింగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ముగ్గురికి గాయాలు

సత్తెనపల్లి రూరల్, జూలై 21 : ఇరు వర్గాల మధ్య ఘర్షణలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని వెన్నాదేవిలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదూరి సుభాషిణి, రాట్నాల శంకర్‌లు గ్రామంలోని రహదారిలో పూల మొక్కలు పెంచుతున్నారు. ఈ రహదారి వివాదం కోర్టులో ఉండటంతో ఇక్కడ మొక్కలు ఎలా పెంచుతారు? అంటూ వీరిద్దరిని మాదంశెట్టి హుస్సేన్‌రావు, కొండలరావులు నిలదీశారు. దీంతో వీరి మధ్య స్వల్ప వివాదం జరగ్గా దారిలో ఉన్న మొక్కలను కొండలరావు, హుస్సేన్‌రావులు తొలగించారు. ఈ ఘటనతో వీరి మధ్య వాగ్వివాదం ఏర్పడగా ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో శంకర్, సుభాషిణి, హుస్సేన్ రావులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలకు చెందిన తొమ్మిది మంది పై కేసులు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

శాకంబరీ దేవిగా బాలచాముండికా అమ్మవారు

అమరావతి, జూలై 21: ఆషాడ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని రాష్ట్రంలో సుభిక్షంగా కూరగాయలు పండాలని కోరుకుంటూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా వివిధ రకాల కూరగాయలు,పండ్లతో అర్చకులు అలంకరించారు. శాకం బరిదేవిగా దర్శనమిస్తున్న అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు.



కూరగాయలతో శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న బాలచాముండికా అమ్మవారు

పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వైభవంగా గురుపౌర్ణమి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, భక్తులు



సాయి బృందావనం వద్ద పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పాల్గొన్న భక్తులు

వినుకొండ టౌన్, జూలై 21: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని సాయి బృందావనం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణతో వైభవంగా ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులతో పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, గురూజీ ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో భాగంగా మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వినుకొండపై గత మూడు సంవత్సరాలుగా అఖండజ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహిస్తున్న గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హిమాలయ గురూజీ మాట్లాడుతూ సంకల్పం ఉంటే ఎంతటి కార్యక్రమాన్ని అయినా కొనసాగించవచ్చని, మూడు సంవత్సరాలుగా చేపడుతున్న కార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులకు, వినుకొండ నియోజకవర్గం ప్రజలకు ఆశీస్సులు అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు, విఠంరాజుపల్లి గ్రామస్థులు, రాజకీయ నాయకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● వినుకొండ, జూలై 21: పట్టణంలోని ఎన్ఎస్పీ కార్యాలయం ఆవరణలోని సాయి బాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు గురు బ్రహ్మేంద్రశర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు మక్కెన చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బ్యాంకు నాగేశ్వరరావు, ఉప్పలపాటి నరసయ్య, ఎన్వీ నారాయణ, గుంట గురునాథం, రమణమూర్తి, కూచి నాగేశ్వరరావు, వంకాయలపాటి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబా దేవాలయంలో సాయి బాబా వ్రతాలు

● వినుకొండ, జూలై 21: పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశాస్త్రి భక్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయి బాబా వ్రతాలు చేపట్టారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని గత 22 రోజుల నుంచి సాయి చాలీసా పారాయణంతో పాటు, సహస్రనామ పారాయణం చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం నిర్వాహకులు దొగుపత్తి వెంకట ప్రసాద్‌రావు, సెక్రటరీ కొల్లిపర బాల సుబ్రమణ్యం, ట్రెజరర్ పన్నిశెట్టి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, మతుకుమల్లి, శావల్యాపురం, పోట్లూరు, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లోని దేవాలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయంలో ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని స్వామివార్లకు కూరగాయలు, పండ్లతో అలంకరణచేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, చీరెసారెలను కానుకగా సమర్పించారు. సాయంత్రం దేవాలయాల్లో భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

● ఈపూరు, జూలై 21: గురుపౌర్ణమి వేడుకలను మండలంలో ఆదివారం



గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి


ఘనంగా జరుపుకున్నారు. ఈపూరు, ముప్పాళ్ళ, కొండ్రముట్ల గ్రామాలలోని షిరిడీ సాయిబాబా మందిరాలలో సాయి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయిబాబాకు కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం,సామూహిక సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్రం, మధ్యాహ్న హారతి, సాయి బాబా ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సమాజంలో గురు స్థానాన్ని ఎవ్వరూ భర్తీ చేయలేరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 21: సమాజంలో గురువు స్థానంను ఎవ్వరూ భర్తీ చేయలేనిదని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం గురు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా పట్టణంలోని పురుషోత్తపట్నం, పట్టణ పోలీసు స్టేషన్‌ల వద్ద ఉన్న షిరిడీ సాయి మందిరంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

● నాదెండ్ల, జూలై 21: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపవరంలోని శాంతి నగర్‌లోని షిరిడీసాయి ఆలయం, నాదెండ్లలోని చెట్టు సెంటర్‌లోని ఆలయం, చిరుమామిళ్ళ గ్రామంలోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో సాయి నాథునికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే



కూరగాయలు, పండ్లతో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ



కారుమంచిలో ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

విధంగా గణపవరం గ్రామ పరిధిలో కొత్త మార్కెట్ యార్డు వెనుక ఉన్న షిరిడీ ఆశ్రమంలో అభిషేకాలు కాగడ హారతి ఇచ్చి పలువురు దంపతులు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. ఆది పరాశక్తి పీఠంలో కూడా గురు పౌర్ణమి ఘనంగా నిర్వహించారు.

జ్ఞాన సంపదే ప్రపంచంలో గెలుస్తుంది: డాక్టర్ వెంకటేశ్వర యోగి

● నరసరావుపేట టౌన్, జూలై 21: జ్ఞాన సంపదే ప్రపంచంలో నిలిచి గెలుస్తుందని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ప్రధాన యోగాచార్యులు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగ గురూజీ అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్ర నరసరావుపేట పట్టాభిరామస్వామి ఆలయం వెంకటేశ్వర కళ్యాణమండపంలో నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 31వ వార్షిక గురుపూజ మహోత్సవం, 175ఎ అండ్ బీ శిబిరాల ఆనందమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆతుకూరి వెంకటేశ్వరయోగి గురూజీ మాట్లాడుతూ జగత్ అంతా ధర్మం మీద ఆధారపడి ఉందన్నారు. మరో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త పాల్గొన్నారు. నాగసరపు సుబ్బరాయగుప్తను, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీవెంకటేశ్వరయోగ సేవా కేంద్రాల నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధనరావు, కన్వీనర్ కూనిశెట్టి అనురాధ, గురుపూజ మహోత్సవ ఆహ్వాన కమిటీ పొలిమేర వెంకటరెడ్డి, భవనాసి రామారావు, నల్లపాటి చిన్నబ్బాయి, దూళిపాళ వెంకటేశ్వర్లు, అడ్డగిరి వెంకట సీతా రమేష్‌బాబు, రాయపూడి సత్యనారాయణ, పబ్బతి వెంకట నాగగురుస్వామి, నాగారపు గురుస్వామి, వేమా సురేష్, ప్రకాశరావు, సకిల శ్రీనివాసరావు, యక్కల సత్యనారాయణ, మాడిశెట్టి వెంకటేశ్వర్లు, కనమర్లపూడి శారద, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాలకు చెందిన యోగా సాధకులు, మహిళలు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్, జూలై 21 : నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న షిర్డి సాయిబాబు మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. అన్నప్రసాద



గురుపౌర్ణమి సందర్భంగా సాయి బాబా వ్రతాలు చేస్తున్న మహిళా భక్తులు

వితరణ జరిగింది. మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, సాయంత్రం పల్లకి ఉత్సవం, రాత్రి శేజ్ హారతి తదుపరి పూలంగిసేవ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గురువుల నుంచి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే

● నరసరావుపేట టౌన్, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా తన గురువుల నుంచి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆశీర్వాదం తీసుకున్నారు. తనకు చదువు చెప్పిన గురువులను ఆత్మీయంగా సన్మానించారు. ఎస్ఎస్ఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కె మూర్తి, అధ్యాపకుడు జేఎల్ఎంమూర్తి, ఉపాధ్యాయురాలు పాలూరి నాసరమ్మలను వారి ఇళ్లకు వెళ్లి శాలువాతో సత్కరించారు. వారి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాన్ని పొందారు. ఆయన వెంట బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, షేక్ మహమ్మద్ రఫీ, కొట్టా కిరణ్‌కుమార్, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల, జూలై 21: మండలంలోని పలు గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రొంపిచర్ల, బుచ్చిబాపన్నపాలెం, వడ్లమూడివారిపాలెం, అచ్చయ్యపాలెం, కొత్తపల్లి, విప్పర్ల గ్రామాల్లోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం భజనా కార్యక్రమాలు జరిగాయి. ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.



గణపవరంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న దంపతులు



సిద్ధమవుతున్న కేంద్రీయ విద్యాలయ భవనం

తుది దశలో కేవీ భవన నిర్మాణాలు

నాదెండ్ల, జూలై 21: కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాల నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. మండలంలోని ఇర్లపాడు గ్రామ పరిధిలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ సమీపంలో ఈ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.20కోట్ల అంచనా వ్యయంతో 2023 మార్చి నుంచి ఈ భవనాల నిర్మాణాలను చేపట్టారు. సుమారు 9.60 ఎకరాల్లో శాశ్వత భవనాలతో పాటు సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 2018లో అప్పటి మంత్రి పుల్లారావు కృషితో కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. 2019నుంచి గణపవరంలోని చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ ప్రాంగణంలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇర్లపాడు గ్రామ పరిధిలో శాశ్వత భవనాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేపట్టగా కోర్టు వివాదం వల్ల కాలయాపన జరిగింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చొరవతో సమస్య పరిష్కారమైంది. ఆయన శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. విద్యాలయంలో తరగతి గదులతో పాటు సిబ్బంది నివాసం ఉండేందుకు వసతి గృహాలను నిర్మిస్తున్నారు. ఈ విద్యాలయంలో ఈ ఏడాది ఒకటి నుంచి 10వ తరగతి వరకు తరగతులు జరుగుతాయి. వచ్చే ఏడాది ఇంటర్ మీడియట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. నిర్మాణ పనులు పూర్తయితే ఆగస్టు నెలలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది.



మైదవోలు-లింగారావుపాలెం గ్రామాల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలను వెట్ మిక్స్‌వేసి పూడ్చుతున్న కూలీలు

ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు

యడ్లపాడు, జూలై 21 : మండల కేంద్రమైన యడ్లపాడు నుంచి మైదవోలు మీదుగా లింగారావుపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్వహణ పట్టించుకోకపోవడంతో భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు నిలబడి గుంతలు ఎంతలోతు ఉన్నాయో తెలియక వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. దీంతో లింగారావుపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు నంబూరు కృష్ణారావు సొంత నిధులతో రహదారి రహదారి మరమ్మతులు చేపట్టాడు. ఆదివారం ట్రక్కులకొద్దీ వెట్‌మిక్స్‌ను తోలించి కూలీలతో గుంతలలో పోయించి చదును చేయించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్వహణ లేక రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. గత ఐదేళ్ళలో రహదారికి తట్ట మట్టి కూడా వేయకపోవడంతో అధ్వానంగా తయారై వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండడంతో మరమ్మతులు చేయిస్తున్నానన్నారు. గ్రామానికి చెందిన తోకల రాజేష్, నంబూరు వీరాంజనేయులు, తోకల సుబ్బారావు, నంబూరు రంగారావు, ఆలోకం సాంబయ్య తదితరులు మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

హాస్టళ్ళల్లో పరిస్థితులు అస్తవ్యస్తం

చిలకలూరిపేట, జూలై 21: పట్టణంలోని హాస్టళ్ళల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని హాస్టళ్ళ సందర్శన కార్యక్రమంలో వెల్లడైనట్టు ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం తెలిపారు. పెదనందిపాడు రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో నిద్ర కార్యక్రమంలో భాగంగా సందర్శించినప్పుడు విద్యార్థులు తమకు పెడుతున్న భోజనం సరిగా లేదని, బాత్రూం డోర్‌లు ఊడిపోయాయని, ఫ్యాన్‌లు సక్రమంగా పనిచేయటం లేదని, దోమల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారన్నారు. పైపులు పగిలిపోవటం వల్ల నీటి సరఫరా నిలిచిపోయాయన్నారు. 80మంది విద్యార్థులకు రెండు కిలోల చికెన్ ఇస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. సమస్యల గురించి తల్లిదండ్రులకు చెప్పటానికి ప్రయత్నిస్తే హాస్టల్ సిబ్బంది తమతో కఠినంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు చెప్పారన్నారు. కాగా నవంబరు నుంచి హాస్టల్‌కు రావాల్సిన మెస్ బిల్లులను ప్రభుత్వం ఇంతవరకు చెల్లించలేదని హాస్టల్ అధికారి తెలిపారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బొంతా భగత్‌సింగ్, మెగావత్ సాయినాయక్, గోపీ, రఘు, సిద్దు, మధు, హిమంత్, ఏ శ్రీనివాస్, జగదీష్, జాసిత్ తదితరులు పాల్గొన్నారు.

12వ వేతన సవరణ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలి

చిలకలూరిపేట, జూలై 21: రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘం కమిషనర్ ఛైర్మన్‌ను తక్షణం నియమించాలని ఎస్‌టీయూ నాయకులు ఆదివారం డిమాండ్ చేశారు. జీవో నెంబరు 117ను రద్దుచేసి విలీనమైన తరగతులను మాతృ పాఠశాలలకు మళ్ళించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను తక్షణం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌టీయూ నాయకులు కే కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు, వినుకొండ అంకయ్య, మేకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో పారిశుధ్య పనులు

రొంపిచర్ల, జూలై 21: పారిశుధ్య పనులను ఆదివారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు పూడిక తీత పనులను చేపడుతున్నట్టు పడాల చక్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు రూ.50వేల మందుల వితరణ

చిలకలూరిపేట, జూలై 21: స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాలకు ఆదివారం సమీపంలోని కనపర్రులో ఉన్న నైస్ స్కూల్ డైరెక్టర్ పీ పూర్ణచంద్రరరావు రూ.50వేలు విలువైన మందులను ఉచితంగా అందజేశారు. నైస్ స్కూల్ ప్రతినిధి రావుల సుబ్బారావు ఈ మందులను క్లబ్‌కు తీసుకువచ్చి స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌కు చెందిన ఉప్పుటూరి ప్రసాదు, కందిమళ్ళ అంజిబాబు, డీ లక్ష్మీనారాయణ, కందిమళ్ళ సాంబశివరావు, తోటకూర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న పల్నాడు యూత్, స్టూడెంట్ ఫెస్ట్

చిలకలూరిపేట, జూలై 21: ఈ నెల 27న స్థానిక నరసరావుపేట సెంటర్‌లోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు యూత్, స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు అంజనేయరాజు, కే సాయికుమార్, ఆదివారం తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వారు ఈ ఫెస్ట్‌లో యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించటం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంఎల్‌సీలు కేఎస్ లక్ష్మణరావు, మర్రి రాజశేఖర్ పాల్గొంటారని తెలిపారు.

పల్నాడు జిల్లా వాల్మీకి బోయ సంఘం యూత్ అధ్యక్షుడిగా మల్లా

యడ్లపాడు, జూలై 21: మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన మల్లా కోటేశ్వరరావు ఏపీ వాల్మీకి బోయ సంఘం పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైనట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాసరావు ఈ మేరకు నియామక పత్రాన్ని పంపినట్లు కోటేశ్వరరావు తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌నాయుడు, కార్యదర్శి క్రాంతినాయుడుతోపాటు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి బోయ యువకులను చైతన్యం పరచి తమ హక్కుల సాధనకై కృషిచేస్తానన్నారు.

ఘనంగా కోటప్పకొండ గిరిప్రదక్షిణ

నరసరావుపేట టౌన్, జూలై 21: ప్రముఖ శైవక్షేత్రం కోప్పకొండ త్రికోటేశ్వరుని గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆషాడమాసం గురుపౌర్ణమి కావడంతో ఉదయం నుంచే సోపాన మార్గం వద్ద నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. భక్తులకోసం విజయగణపతి ఆలయం సమీపంలో కోటప్పకొండ గిరిప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో సాతులూరుకు చెందిన ఎస్ వెంకటేశ్వర్లు, వై రాధాక్రిష్ణమూర్తి, వై హనుమంతురావు, వీ వెంకటేశ్వరరావు, కే శ్రీనివాసమూర్తి అల్పాహారం ఏర్పాటుచేశారు. మార్గమధ్యలో అనుమోలు వెంకయ్య చౌదరి తాగు నీరు ఏర్పాటు చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులు త్రికోటేశ్వరుని దర్శించుకున్నారు. నరరావుపేట, చిలకలూరిపేట, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న చిగురుపాటి శ్రీనివాసరావు

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

రొంపిచర్ల, జూలై 21: మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన మర్రి ఏడుకొండలు ఇటీవల మృతి చెందాడు. కాగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చిగురుపాటి శ్రీనివాసరావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ 10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కామినేని రంగారావు, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, దుస్తులు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ పెద్దలు

పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, దుస్తులు పంపిణీ

వినుకొండ టౌన్, జూలై 21: బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీవీ మాధవరావు ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు బ్రాహ్మణ పెద్దల చేతుల మీదుగా ఆదివారం అందచేశారు. అనంతరం 5వ వార్డు కౌన్సిలర్ పోలూరి అంజలి దేవి, సుబ్బారావులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. ఈ నెల దాతలైన చింతల చెర్వు రాఘవేంద్ర రావు, పుట్టంరాజు, నారాయణరావు, శ్రీనివాసుని శ్రవణకుమార్, దేవులపల్లి విశ్వనాథ శాస్త్రి, అనఘా గోపాలకృష్ణమూర్తి, అప్పరాజు రామకృష్ణ, అక్కిరాజు శశికళ, చింతలపూడి భద్రయ్య, మతుకుమల్లి మురళీధర్, అనఘా సుబ్బారావు, చింతలపూడి హరనాథ్ బాబు సహాయ సహకారాలతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ పెద్దలు ఎంవీ శర్మ, భువనగిరి సుబ్రమణ్యం, ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, అచ్యుత సుబ్బారావు, దారా రామూర్తి, గోపాలుని నరేష్, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న స్థానిక శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, కల్చరల్, జూలై 21: ప్రజా సేవలో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీపాద కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజాసేవలో నిత్యం ఉండే రోటరీ క్లబ్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరలోనే కేటాయిస్తామని చెప్పారు. ప్రజా సేవకోసం రోటరీ క్లబ్ తపన సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. నూతన కార్యవర్గంతో క్లబ్ నిర్వాహకులు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కపలవాయి రాజేంద్ర ప్రసాద్, సెక్రటరీగా సాతులూరి శివకుమార్, ట్రెజరర్‌గా కట్టమూరి ఆంజనేయులు ఇతర డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శాసన సభ్యుడు చదలవాడ అరవిందబాబును ఘనంగా సన్మానించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఇన్సులేషన్ ఆఫీసర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, అసిస్టెంట్ గవర్నర్ ఎం.సుమిత్ర కుమార్, పాస్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డిలు నిర్వహించారు.

గోదాము మరమ్మతులు ఎప్పటికో...?

రొంపిచర్ల, జూలై 21: మండలంలోని అన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాము సుమారు ఐదు సంవత్సరాల క్రితం తగలబడింది. అప్పటినుంచి ఇప్పటివరకు గోదాముకు మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. ఈ సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులకు ఈ గోదాము నుంచి ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తారు. ఐతే సొసైటీ అధికారులు గోదామును పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో మరమ్మతులు నిర్వహించిన రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అన్నవరంలోని సొసైటీ గోదాము

యూవోబీలో మారెళ్ళవారిపాలెం యువకుడికి సీటు



కొత్త పరంజ్యోతి

నూజెండ్ల, జూలై 21: మండలంలోని మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన కొత్త పరంజ్యోతి అనే యువకుడు ఇంగ్లండ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో మాస్టర్ చదివేందుకు నేషనల్ ఓవర్‌సిస్ స్కాలర్ షిప్ (ఎన్‌వోఎస్) ద్వారా సీటు సాధించాడు. మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన పేద కుటుంబంలోని కొత్త చినవెంకయ్య, మార్తమ్మల చిన్న కుమారుడైన పరంజ్యోతి ఇంటర్ వరకు నూజెండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో, ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈలో బీటెక్ పూర్తి చేశాడు. ఇంటర్‌లో కళాశాల సెకండ్, బీటెక్‌లో డిపార్ట్‌మెంట్ టాపర్‌గా, ఏఈఈఈలో స్టూడెంట్ బ్రాంచ్‌కి రెండు సంవత్సరాలు ఛైర్మన్‌గా పనిచేశాడు. ఇతర దేశాల్లో ఉన్నత చదువులు చదవాలనే పట్టుదలతో నేషనల్ ఓవర్ సిస్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసుకొని యూనివర్శిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో సీటు సాధించటంతో ప్రభుత్వం నుంచి రూ.25లక్షల మేర ఆర్థికసాయం అందించేందుకు స్కాలర్‌షిప్ మంజూరవటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పరంజ్యోతికి అభినందనలు తెలియజేశారు.

వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

● పట్టించుకోని పోలీసులు

వినుకొండ టౌన్, జూలై 21: సినీ ఫక్కీలో దొంగలు దేవుని హుండీని దోచుకున్న సంఘటన మండలంలోని అందుగుల కొత్తపాలెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోకి దొంగలు ప్రవేశించి హుండీలోని నగదును దోచుకున్నారు. అంతటితో ఆగకుండా అర్ధరాత్రి గ్రామంలోని మరో ఇంటో ప్రవేశిస్తుండగా శబ్దం రావడంతో దొంగను గమనించి పట్టుకునేందు ప్రయత్నించారు. దొంగ దొరకకుండా డాబా ఎక్కాడు. పారిపోయేందుకు అవకాశం లేకపోవడంతో గ్రామస్థుల చేతికి చిక్కాడు. మరోకడు గ్రామంలోకి పారిపోయాడు. కొంత సమయానికి మరలా ఆదొంగ గ్రామంలో నడుచుకుంటూ వస్తుండగా, గ్రామస్తులు పట్టుకుని ఇద్దరు దొంగలను పోలీసులకు అప్పగించారు, ఇదిలా ఉంగా గ్రామంలో ద్విచక్రవాహనాలల్లో తరచూ పెట్రోలు దొంగలు దోచుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస దొంగతనాలతో గ్రామంలో భయాందోళన నెలకొని ఉన్నాయి. గ్రామస్తులకు పట్టుబడ్డ దొంగలు గత శుక్రవారం పోలీసులు వదిలిపెట్టగా, శనివారం కొత్తపాలెం దేవాలయంలో మరో దొంగతనానికి పాల్పడడం గమనార్హం. వివరణ కోరేందుకు ప్రయత్నించగా పోలీసులు స్పందించ లేదు.

ఇరువర్గాల ఘర్షణ... ముగ్గురికి గాయాలు

సత్తెనపల్లి రూరల్, జూలై 21: ఇరువర్గాల మధ్య ఘర్షణలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని వెన్నాదేవిలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదూరి సుభాషిణి, రాట్నాల శంకర్‌లు గ్రామంలోని రహదారిలో పూలమొక్కలు పెంచుతున్నారు. ఈ రహదారి వివాదం కోర్టులో ఉండటంతో ఇక్కడ మొక్కలు ఎలా పెంచుతారంటూ వీరిని మాదంశెట్టి హుస్సేన్‌రావు, కొండలరావులు నిలదీశారు. దీంతో వీరిమధ్య స్వల్ప వివాదం జరిగి దారిలో ఉన్న మొక్కలను కొండలరావు, హుస్సేన్‌రావులు తొలగించారు. దీంతో వీరి మధ్య ఘర్షణ జరిగి ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడుల్లో శంకర్, సుభాషిణి, హుస్సేన్‌రావులకు గాయాలయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలకు చెందిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ పోలీసులు తెలిపారు.